# 42

# కెరియరిస్ట్

ఆకాశవాణికున్న ఆత్మబంధువుల్లో నేనూ ఒకణ్ణి. ఆర్నెల్లకో, సంవత్సరానికో ఒకసారి కేంద్రానికి వెళ్ళడమూ, ప్రతిఫలంగా వాళ్ళిచ్చే పాతికో పరకో తెచ్చుకోవడం అన్నది ఏళ్ళ తరబడి సాగుతున నా రొటీన్ కార్యక్రమం.

ఆ రోజు స్టేషన్‌కు వెళ్ళి టైమ్ చూసుకున్నాను. సరిగ్గా పది. రికార్డింగ్ పదకొండింటికి ఉంది. కచ్చితంగా టైమ్‌కు రికార్డింగ్ జరుగుతుందన్న భరోసా లేదు. పావుగంటో, అర్ధగంటో ఆలస్యం జరిగినా ఆశ్చర్యం లేదు. అందాకా వెయిటింగ్ రూమ్‌లో కూర్చోవడంకన్నా గత్యంతరం లేదు. కాకపోతే నేను వచ్చిన విషయం ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్ గారికి తెలియచెయ్యడం మంచిదనిపించి ఆయన్ను కలిశాను.

ఆయన నన్ను చూసీ చూడగానే, "వచ్చారా సార్, మంచిది. వెయిటింగ్ రూమ్‌లో కూర్చోండి. పదకొండింటికి మిమ్మల్ని రికార్డింగ్‌కు తీసుకుపోతాను. ఈ లోపల చెక్కు కూడా తయారవుతుంది. తీసుకొని వెళ్ళవచ్చు" అన్నాడు.

వెళ్ళి వెయిటింగ్ రూమ్‌లో జొరబడ్డాను. అప్పటికే ఎవరో ఒక వ్యక్తి ఉన్నాడు అక్కడ. సూటూ, బూటూ - ఆ వాలకం చూస్తే ఖరీదైన వ్యక్తిలా కనిపించాడు. నావైపు ఎగాదిగా చూశాడు. అడ్డ పంచె, మామూలు షర్టు ఉన్న నేను అతని కళ్ళకు ఆనినట్టు లేదు. పురుగును చూసినట్లు చూశాడు.

"ఇక్కడ వెయిటింగ్ రూమ్ ఇంకొకటి ఉండాలే. ఇది వి.ఐ.పీస్ రూమ్" అన్నాడు అతను.

అతను చెప్పింది వాస్తవమే. నాలాటి వారికి వెయిటింగ్ రూమ్ వేరే ఉంది. ఇది డ్రస్సూ, అడ్రసూ ఉన్న వాళ్ళకు ఉద్దేశించిన రూమ్. తలుపు తెరిచి ఉందిగదా అని రూమ్‌లో జొరబడ్డాను. రూమ్‌లోకి వస్తే ఈ అనుభవం ఎదురైంది.

చాలా ఇబ్బందిగా ఫీలయ్యాను. ఏం సమాధానం చెప్పాలో తెలియక మౌనంగా ఉండిపోయాను.

"ఏం చేస్తావు?" అడిగాడు.

'వ్యవసాయం' అన్నాను.

"రేడియో స్టేషన్‌కు ఎందుకు వచ్చినట్టు?"

"రికార్డింగ్ ఉంది."

"ఆదర్శ రైతువా?" హేళనగా నవ్వాడు.

కాదన్నట్టు తల అడ్డంగా తిప్పాను. నా వృత్తి వ్యవసాయం కావచ్చు. ప్రవృత్తి రీత్యా నేను కవిని కావచ్చు. కళాకారుడుని కావచ్చు. ఆ విషయం అతి చిన్న విషయం ఈ మనిషికి ఎందుకు తట్టలేదో!

ఇద్దరి మధ్యా కొంతసేపు మౌనం. ఇంతలో అటెండర్ ట్రేలో కూల్‌డ్రింక్ తెచ్చాడు అతని కోసం. బహుశా స్టేషన్ డైరెక్టరుగారు పంపిఉంటారు.

అతను డ్రింక్ సిప్ చేస్తున్నాడు. నేను శూన్యంలోకి చూస్తూ కూర్చున్నా. ఎంతసేపని అలా కూర్చోను. అతని పక్కనే ఉన్న ఇంగ్లీష్ మాగజైన్ తీసుకొని తిరగేస్తున్నాను. అదొక చౌకబారు మాగజైన్.

"ఇంగ్లీష్ మాగజైన్ అది. నీకేం అర్థం అవుతుంది. అక్కడ పెట్టు" అన్నాడు ముఖమంతా చిట్లించి. అతడన్న మాటకు నా మెదట్లో ఏదో శూన్యం ఆవరించింది. కిమ్మనకుండా మాగజైన్ యథాస్థానంలో ఉంచాను. ఏ మాట మాట్లాడినా ఏమిటీ మనిషి ముఖంమీద కొట్టినట్టు మాట్లాడుతున్నాడు! అతని తీరు నాకు నచ్చలేదు. కోపం కూడా రాకపోలేదు. కానీ, తమాయించుకున్నాను.

"ప్రోగ్రామ్‌కు ఎంతిస్తారు నీకు?" అడిగాడు.

"ఏడు వందలు"

"అబ్బో. ఏడు వందలే" అని, అంతటితో ఆగకుండా, "రేడియో స్థాయి దిగజారిపోతున్నది. దారినపోయే దానయ్యలకు కూడా పిల్చి ప్రోగ్రామ్‌లిస్తున్నారు" అన్నాడు బాధగా.

ఈ మనిషి దగ్గర సివిలైజేషన్ ఉంది గానీ, సంస్కారం బొత్తిగా లేదు. శాడిస్టులాగున్నాడు. నేను అక్కడే కూర్చుంటే ఎన్ని సూటిపోటు మాటలు వినవలసి వస్తుందో ఏమో! లేచి బయటకొచ్చాను. అటెండరు కనిపించాడు.

"ఎ.కె. డ్యూటీలో ఉన్నాడా" అన్నాను.

"ఉన్నాడు సార్. ఇప్పుడే లైబ్రరీకి వెళ్ళినట్టుంది. అక్కడికివెళ్ళి కలవండి."

నేను వెళ్ళేసరికి ఏ.కె. ఏవో క్యాసెట్లు పరిశీలిస్తున్నాడు. నా అడుగుల చప్పుడు విని తల పైకెత్తి చూశాడు.

"నమస్కారం సార్. ఎప్పుడొచ్చారు? బాగున్నారా? ఈ రోజు రికార్డింగ్ ఉందేమిటి" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు.

నేను ఆ ప్రశ్నలన్నింటికీ జవాబు చెప్పలేదు.

"బాగున్నావా ఏకే" అన్నాను.

"బాగున్నావా అని అడగాల్సిన పని లేదు. ఏ.కే ఎప్పుడూ ఓ.కేనే. చెప్పండి సార్ కాఫీనా, కూల్‌డ్రింకా; ఏది తీసుకుంటారు?"

"ఏదీ వద్దు. కడుపు నిండింది."

"ఏం తిన్నారు?"

"చివాట్లు."

ఏ.కె. నాకేసి అదోలా చూశాడు.

"ఏంది సార్ కొత్తగా చెబుతున్నారు. మిమ్మల్ని చీవాట్లు పెట్టగలిగిన మొగోడున్నాడా ఇక్కడ? ఈ ఏ.కే.తో చెప్పండి వాడెవడో తేలును చంపినట్లు మెట్టుతో నలిపి చంపుతాను."

"ఊరికే తమాషాకి అన్నాను లేవోయ్. ఏమిటి విశేషాలు? చెప్పు" అన్నాను నవ్వుతూ.

"మీరు రావడమే విశేషం. మీరీ మధ్యాన్నం పండ్రెంటింటికి మా ఇంటికి భోజనానికి వస్తున్నారు."

"అప్పటికి రికార్డింగ్ పని అయిపోవాలి గదా."

"రికార్డింగ్ పని గురించి మీకెందుకుసార్ బెంగ. పండ్రెంటింటికి కాకపోతే మూడింటికి అవుతుంది. మీ కథ నేను రికార్డు చేస్తాను సరేనా?"

"సరే."

"ఇంటికెళ్ళే ప్రయత్నంలో ఉన్నాను. మీరొస్తే ఆగాను. ఇంటికెళ్ళి భోజనం ఏర్పాట్లు చూస్తాను" అన్నాడు ఏ.కె.

"కుండలో కలిగింది ఏది పెట్టినా తినేవాణ్ణి. నా కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లేమిటి? ఎందుకంత శ్రమ?"

"మీతోబాటు మరో అతిథి ఉన్నాడు. డాక్టర్ శ్యామ్‌ప్రసాద్. యూనివర్సిటీలో ప్రొఫెసర్." ఏ.కె. అన్నాడు.

"ఒరే ఏ.కే. ఒకమాటంటాను. ఏమీ అనుకోకు. నువ్వు జోకరు లాంటి వాడివి. ఎక్కడైనా కలిసిపోగలవు. నాకు ప్రొఫెసర్లన్నా, డాక్టరేట్లన్నా చచ్చేంత భయం. వాళ్ళ దగ్గర కూర్చున్నామా? ఆ మాటో ఈ మాటో మాట్లాడక తప్పదు. ఆ మాటల్లో మన అజ్ఞానం బయటపడుతుంది. నేను అందుకు సిద్ధంగా లేను."

"ఏ.కె. పగలబడి నవ్వాడు."

"నవ్వుతావెందుకు?"

"మీరు జోక్ చేస్తూంటే నవ్వక ఏం చెయ్యమంటారు సార్?"

"కొన్ని నిజాలు జోకుల్లా ఉంటాయి."

"సరే సార్. భోజనం దగ్గర కూర్చున్నప్పుడు తీరిగ్గా మాట్లాడుకుందాం. ఫ్రైడ్ రైస్ కామన్. అందులోకి చికెన్ రోస్ట్ చేయించమంటారా? మటన్ రోస్ట్ చేయించమంటారా? ఆ నోటితోనే ఇంకొక ముక్క సెలవియ్యండి. విస్కీ ఏ బ్రాండ్ తెప్పించమంటారు?"

"ఇదో ఏ.కె. కుయ్యో మొర్రో నేను రానని మొత్తుకుంటుంటే ఏమిటి నీ నస?"

"మా గురువుగారు ప్రొపెసర్ల సరసన కూర్చోవడానికి కూడా భయపడే కాంప్లెక్స్ ఉన్నవాడని నన్ను నమ్మమంటారా? మీరు అంటున్నారు గనుక చెబుతున్నాను ఆ ప్రొఫెసర్ మీకు కొత్తవాడు కాదు. సరిగ్గా ఇరవై సంవత్సరాల కిందటి మాట. ఒక రిసెర్చి స్కాలర్ మిమ్మల్ని కలుసుకోవడానికి ఉరుటూరుకి వచ్చాడు. జ్ఞాపకముందా సార్" అన్నాడు ఏ.కే.

"ఇరవై సంవత్సరాల నాటి విషయాలు ఎక్కడ జ్ఞాపకముండి చస్తాయ్. మధ్యాన్నం ఏ కూడు తిన్నానో రాత్రికి జ్ఞాపకం ఉండి చావడం లేదు. కొంచెం వివరంగా చెప్పు."

"సరే. 'కడప జిల్లా కథానిక' మీద థీసిస్ రాయడానికని మెటీరియల్ సేకరించడానికి మిమ్మల్ని గురించి వివరాలు తెలుసుకోవాలని మీ దగ్గరికి వచ్చాడు. ఆ సందర్భంలో కడప జిల్లాలోని ఇతర రచయితల్ని పరిచయం చెయ్యడానికి మీరు నా పేరు సజెస్ట్ చేశారు. ఆయనే ఈయన" అన్నాడు.

"ఓహో! అలాగా" అన్నాను సాలోచనగా.

"కాబట్టి మీరు మా ఇంటికి అన్నానికి వస్తున్నారు. ఇల్లు మీకు తెలుసు కదా. పోతే, రికార్డింగ్ టైమ్ వరకు ఇక్కడే కూర్చోండి. ఇంటికి పోతున్నాను. బయటకెళ్ళి కాఫీ పంపుతాను" అంటూ వెళ్ళిపోయాడు.

కళ్ళు మూసుకుని ఇరవై సంవత్సరాల నాటి జ్ఞాపకాల్ని మెదడు అట్టడుగు పొరలనుంచి బయటికి లాగడానికి ప్రయత్నించాను.

ఆ రోజు ఉదయం మంచంమీద కూచొని జీతగాణ్ణి పిలిచి ఏవో పొలం పనులు పురమాయిస్తున్నాను.

చేతిలో బ్రీఫ్‌కేస్ కిందబెట్టి తటాలున పాదాభివందనం చేశాడు. ఈ హఠాత్ సంఘటనకు చకితుణ్ణయ్యాను.

"ఆఁ, ఆఁ ఏమిటిది" అన్నాను ఆశ్చర్యంగా.

"పెద్దలు. పాదాభివందనం చేస్తే తప్పేమిటి?"

కాసేపు నాకు నోట మాటరాలేదు. తేరుకొని. "ఎవరు మీరు" అన్నాను.

"నా పేరు శ్యామ్‌ప్రసాద్ సార్. పిహెచ్.డి కోసం 'కడప జిల్లా కథానిక' మీద థీసిస్ రాయాలనుకుంటున్నాను. ఆ పని మీదే కడపకు వెళ్తూ దారిలో ఉన్నారు గదా అని ఇక్కడ దిగాను."

"ముందు కాళ్ళూ, మొగం కడుక్కో. తర్వాత మాట్లాడుకుందాం" అన్నాను.

ప్యాంటు విప్పి లుంగీ కట్టుకొని కాళ్ళూ మొఖం కడుక్కొని వచ్చి నా దగ్గర కూచున్నాడు. కాఫీ ఇస్తే తాగాడు.

"ఇప్పుడు చెప్పండి. ఏం చేస్తారు మీరు?"

"ఎమ్.ఏ. పూర్తి చేశాను. ప్రస్తుతానికి ఏమీ చెయ్యడం లేదు. ఈ రిసెర్చ్ వర్కు చెయ్యాలనుకుంటున్నాను."

"మీకు కథానికా సాహిత్యంలో అభినివేశం ఉందా?"

"లేదు సార్" అన్నాడు నీరసంగా.

అతను చెప్పింది నిజమే. కథానికా సాహిత్యం గురించి అతనికి ప్రాథమిక పరిజ్ఞానం కూడా లేదనే విషయం మాటల సందర్భంలో వెల్లడయింది. మాటల సందర్భంలో చా.సో. విషయం వస్తే ఎవరు సార్ ఈ చా.సో. అన్నాడు.

అతన్ని చూస్తే నాకు జాలేసింది. నేనేం మాట్లాడలేదు.

రిసెర్చ్ చెయ్యడానికి అవసరమైన ఇన్వెంటివ్‌నెస్, ఇమాజినేషన్, ఇంట్యూషన్ లాంటివి లేకపోతే పోనీ, కనీసం సబ్జక్టుకు సంబంధించి మామూలు విషయ పరిజ్ఞానం కూడా లేనివాళ్ళు ఎలా పరిశోధన చేస్తారో నాకర్థమై చావలేదు. అందుకనే అతణ్ణి చూస్తే జాలేసింది.

"సరే. నావల్ల కావలసిన సహాయం ఏమిటో చెప్పండి?" అన్నాను.

"మీ కథలు అచ్చయి ఉంటే ఆ పుస్తకాలు ఇవ్వండి. వాటిమీద వచ్చిన సమీక్షలు కూడా ఇవ్వండి. కథానికకు సంబంధించి మీరు రాసిన వ్యాసాలేవైనా ఉంటే ఇవ్వండి. అలాగే మీ బయోడేటా కూడా" అన్నాడు.

నా దగ్గర ఉన్న మెటీరియల్ అంతా ఇచ్చాను.

"ఈ జిల్లాకు సంబంధించిన కథానికా రచయితలందరూ కడపలోనే ఉన్నట్లు విన్నాను. ఔనా సార్."

"కడప జిల్లా కథానికకు ఆద్యుడు నాదముని రాజుగారు. ఆయన చనిపోయారు. ఆయనకు సంబంధించిన మెటీరియల్ మీకు కడపలోనే దొరకవచ్చు. పోతే రా.రా, వై.సి.వి. రెడ్డి, కేతు విశ్వనాథరెడ్డి, పి.రామకృష్ణారెడ్డి, కుప్పిరెడ్డి పద్మనాభరెడ్డి - అంతా కడపలోనే ఉన్నారు. విమర్శకులు ఆర్వీయార్ కూడా కడపలోనే ఉన్నాడు. ఆయన్ని కూడా కలవండి. ఆయన సలహాలు మీకు ఉపయోగపడవచ్చు."

"మంచిది సార్. వీళ్ళ అడ్రసులు నాకు తెలియవు. వీళ్ళను కలిసే మార్గమేదో మీరే చెప్పండి సార్" అన్నాడతను.

నేను కొంచెంసేపు ఆలోచించి, "మీరు ఒక పని చెయ్యండి" అన్నాను.

"ఏమిటి సార్."

"నా శిష్యుడు ఏ.కె. అని ఆకాశవాణిలో అనౌన్సర్‌గా పనిచేస్తున్నాడు. సాహిత్యంలో గురుశిష్య

సంబంధాల్ని నేను అంగీకరించను. కాకపోతే ఆ అబ్బాయి నన్ను గురువుగా గౌరవిస్తాడు. అందుకు శిష్యుడంటున్నాను. అతనికి సాహిత్యంలోనూ, సంగీతంలోనూ మంచి అభినివేశం ఉంది. రా.రా. నుంచి ఆర్వీయార్‌దాకా కడపలో అందరితో అతనికి సాన్నిహిత్యం ఉంది. అతణ్ణి కలు. నేను పంపానని చెప్పు. ఆ పని అంతా చేసిపెడతాడు."

"అలాగే సార్. మిమ్మల్ని ఇంకో విషయం అడుగుతాను. ఏమనుకోరు కదా?"

"అడగండి" అన్నాను.

"నాదముని రాజుగారిని మినహాయిస్తే ఈ జిల్లాలోని కథానిక రచయితలందరూ రెడ్లే. మిగతా కులాల నుంచి కథానికా రచయితలు లేకపోవడానికి కారణమేమిటి?"

"ఈ విషయం నాకెప్పుడూ తట్టలేదు. ఈ విషయాన్ని కూడా ఒక పరిశోధనాంశంగా మీ థీసిస్‌లో చేర్చండి" అన్నాను నవ్వుతూ.

"థాంక్స్ సార్. ఓ పని అయిపోయింది. ఇక నేను బయలుదేరతాను" అంటూ బ్రీఫ్‌కేస్ చేతికి తీసుకున్నాడు.

"అప్పుడే ఏమయింది. ఆవగింజలో అర్థం కాలేదు. మిమ్మల్ని మళ్ళీ కలుస్తాను" అంటూ వినయంగా నమస్కరించి బయలుదేరాను.

నేను అతన్ని సాగనంపడానికి వీధి మొగదాకా వచ్చి, "థీసిస్ సబ్మిట్ చేయడానికి ఎంతకాలం పడుతుంది" అన్నాను.

"కనీసం రెండు సంవత్సరాలు పట్టవచ్చు సార్ - ఏ.కె. అన్నారు. అతని పూర్తి పేరు చెప్పలేదు."

"అతని పూర్తిపేరు అబ్దుల్ ఖాదర్. కానీ ఏ.కె. అంటేనే అందరికీ తెలుస్తుంది. వెళ్ళిరండి" అంటూ సాగనంపాను.

ఆ తర్వాత మూడు నెలలకనుకుంటాను. కడపకు వెళ్లినప్పుడు స్టేషన్‌లో ఏ.కే.ను కలిశాను.

"మీరు వస్తారని తెలుసు సార్. మీకోసమే ఎదురుచూస్తున్నాను."

"నేను వస్తానని కలగన్నావా ఏమిటి?"

"కలగాదు సార్. రా.రా.గారు ఎల్లుండి మాస్కోకు బయలుదేరుతున్నారు గదా. చూడటానికి రాకుండా ఉంటారా?"

"అదా సంగతి."

"ఇంతకూ ఇప్పుడు ఏ లాడ్జిలో దిగబోతున్నారు మీరు."

"జేబిలో డబ్బుల్లేవు. చెడిపోయినవారికి చంద్రాయుడి దేవళం అన్న సామెత ఉంది. వై.సి.వి. గారింట్లో దిగుదామనుకుంటున్నాను."

"లాభం లేదు. అది హౌస్‌ఫుల్. ఇంటినిండా ఎవరో బంధువులున్నారు. మయూరా లాడ్జిలో దించుతాను పదండి."

"ఏదో తిరకాసు పెడుతున్నావు."

ఏ.కె. నవ్వి, "మూడు వందల పేజీల మనుస్క్రిప్టు ఒకటి చదివి మీరు కరెక్షన్లు చేయాలి. అందుకని మీకు ఏకాంతం అవసరం. అందుకు మీరు లాడ్జిలోనే దిగాలంటున్నాను."

లాడ్జిలో దిగక తప్పలేదు. మూడింటికి చేటభారతం ఇంటినుంచి తెచ్చి నా ముందు పెట్టాడు.

"ఏమిటిది?"

"కడపజిల్లా కథానిక మీద థీసిస్"

"ఎవరు రాశారు?"

"నేనే."

"నీకేం కర్మ ఈ బాడకోవ్ పని చెయ్యడానికి."

"మీరు చెప్పారు గదా సాయం చెయ్యమని"

"ఇదంతా రాసిపెట్టమన్నానా? మోటు సామెత ఒకటుంది చూడు - ములాజాకు పోయి ముండ యాకటయిందని - అలా ఉంది నీ వ్యవహారం."

"ములాజా గిలాజా జాన్తా నై సార్. ఎవరి లాభం వాడిది. ఇది రాసిపెట్టినందుకు అయిదు వేలు. అక్షరాలా అయిదే వేలు గురుదక్షిణ ఇచ్చుకున్నాడు. మీ ముందు దాపరికం ఎందుకు?"

ఆశ్చర్యంతో నాకు నోట మాట రాలేదు.

"ఎందుకుసార్ అంత ఆశ్చర్యంగా చూస్తారు. ఆశ్చర్యపోవడం అజ్ఞానుల వంతు. తీరిగ్గా చదివి కరెక్షన్ చేయండి. మళ్ళీ రేపు కలుస్తాను" అంటూ ఏ.కె. వెళ్ళిపోయాడు.

ఏ.కె. రాసిన థీసిస్ శ్రద్ధగా చదివాను. చాలా నీట్‌గా రాశాడనిపించింది.

నిజానికి నేను చెయ్యవలసిన కరెక్షన్లు కూడా ఏమీ లేవు. కాకపోతే అక్కడక్కడ ఫినిషింగ్ టచెస్ ఇచ్చాను.

రెండేళ్ళ తర్వాత అతనికి డాక్టరేట్ వచ్చిన విషయం ఏ.కె. చెప్పాడు. ఆ థీసిస్ పుస్తక రూపంలో కూడా వచ్చింది. పూర్తిగా ఏ.కె. రాసిందే.

ఇదీ ఇప్పుడు ఏ.కె. ఇంటికి భోజనానికి వస్తున్న ప్రొఫెసర్ గారి నేపథ్యం!

నాకు పండ్రెండింటికి రికార్డింగ్ పని పూర్తయింది. కాళ్ళీడ్చుకుంటూ ఏ.కె. ఇంటికి వెళ్ళేసరికి పండ్రెండున్నర అయింది.

వాకిట్లో ఏ.కె. భార్య కనిపించి, "మీకోసం పైన ఎదురు చూస్తున్నారు సార్" అంది.

నేను పైకి వెళ్ళి ప్రొఫెసర్ వేపు చూశాను. చిత్రం! అతను ఇందాకా నాకు వి.ఐ.పి. రూమ్‌లో తారసిల్లిన మనిషి!

ఏ.కె. నన్ను గురించి అతనికి చెప్పినట్లు ఉంది.

నన్ను చూడగానే ప్రొఫెసర్‌గారు అప్రతిభుడై పోయాడు!

**- (2000, ఇండియాటుడే)**